ఓ ఫారం లేకుండా స్టాక్ అమ్మరాదు : ఏడిఎ

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ఓ ఫారం లేకుండా ఎటువంటి స్టాకు అమ్మరాదని వ్యవసాయశాఖ మదనపల్లి ఏడిఏ శివశంకర్ తెలిపారు. బుధవారం మండలంలోని ఎరువుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసే ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు తదితర వాటికి తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని సూచించారు. బిల్లులు లేకుండా దుకాణాల్లో స్టాక్ అమ్మితే చర్యలు లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఒ హేమలత, ఎఇఒ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

స్టాక్ రిజిస్టర్లను పరిశీలిస్తున్న ఏడిఎ శివశంకర్

కలుషిత ఆహారం తిని విద్యార్థులకు అస్వస్థత

సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఘటన - స్థానిక పిహెచ్‌సిలో చికిత్స - హాస్టల్‌ను పరిశీలించిన ఆర్‌డిఒ, డిఎంహెచ్‌ఒ, డిడి

ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-ముద్దనూరు

సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో కలుషిత ఆహారం తిని ఎనిమిది మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. బుధవారం స్థానిక సాంఘీక సంక్షేమ వసతి గృహంలో ఉదయం అల్పాహారంలో భాగంగా హాస్టల్లో విద్యార్థులకు ఇడ్లి, సాంబారు ఏర్పాటు చేశారు. 28 మంది విద్యార్థులు అల్పాహారం తిన్నారు. వీరిలో యశ్వంత్, బన్నీ, వెంకటేష్, సతీష్, లక్ష్మి నరసింహులు, సుశాంత్, పెంచల్ నరసింహులు, నాగేంద్రకు కడుపు నొప్పి, వాంతులై అస్వస్థతకు గురయ్యారు. యశ్వంత్, బన్నీ తీవ్ర అస్వస్థతకు గురవడంతో ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. స్థానిక పిహెచ్‌సి వైద్యులు కరిష్మా, శ్రీకాంత్ బాధిత విద్యార్థులకు మందులు ఇచ్చి వైద్య పరీక్షలు నిర్వహించారు. జమ్మలమడుగు ఆర్‌డిఒ శ్రీనివాసులు హాస్టల్ వద్దకు చేరుకుని వంట గదిని, ఆహారాన్ని, పరిసరాలను పరిశీలించారు. అల్పాహారాన్ని పరిశీలించి బాధిత విద్యార్థులతో, హాస్టల్ వార్డెన్, కమాటి, వంట మనిషిని ఇలా ఎందుకు జరిగిందని ప్రశ్నించారు. అధికారులతో మాట్లాడి కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో బాధిత విద్యార్థులను పరామర్శించారు. ఇడ్లి ఉడకలేదని సాంబారులో వేసిన కంది పప్పు ఉడకలేదని ఇవి తినడం వల్ల అస్వస్థతకు గురైనట్లు బాధిత పిల్లలు ఆర్‌డిఒకు తెలిపారు. ఉదయం అల్పాహారం ఇడ్లి, సాంబారు తిని బడికి వెళ్ళామని అక్కడ కడుపు నొప్పి, వాంతులు అయ్యాయని చెప్పారు. అల్పాహారం, భోజనం, కూరలు రుచికరంగా ఉండవని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ శ్రీనివాసులు మాట్లాడుతూ అల్పాహారం, సాంబారు, నీటి శాంపిళ్ళ సేకరించి పరీక్షలు జరిపించాలని అధికారులకు సూచించారు. నీటి క్యాన్లతో నీటి సదుపాయం కల్పించాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని వార్డెన్ మనోహర్‌కు ఆదేశించారు. ప్రతి రోజు హాస్టల్ తనిఖీ చేయాలని విఆర్‌ఒకు సూచించారు. నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని, నీరు అందించాలని ఆదేశించారు. అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి, డిఎంహెచ్‌ఒ డాక్టర్ నాగరాజు హాస్టల్ పరిశీలించి అస్వస్థతకు గల కారణాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎంపిడిఒ చంద్ర మౌలీశ్వర్, సిఐ దస్తగిరి, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ శివప్రసాద్ ఉన్నారు. వైద్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన వైద్యమందించాలి

- విద్యార్థి సంఘాల డిమాండ్

మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ బాలుర వసతి గృహంలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించి ఇందుకు కారణమైన హాస్టల్ వార్డెన్, వంట మనిషిని సస్పెండ్ చేయాలని డివైఎఫ్ఐ, టిఎన్ఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. హాస్టల్‌లో అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శించి సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతికి వినతిపత్రం అందజేసినట్లు డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా పార్లమెంట్ అధికార ప్రతినిధి సిద్ధార్థ తెలిపారు. విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ విద్యార్థులు అస్వస్థతకు కారణం వార్డెన్ నిర్లక్ష్యమేనని స్పష్టంగా కనబడుతుందన్నారు. వంట మనిషి ప్రసాద్ వంట సరిగ్గా చేయడం లేదని విద్యార్థులను ఇబ్బందులు పెడుతున్నాడని వార్డెన్ మనోహర్ దృష్టికి తెచ్చిన పట్టించుకోకపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. హాస్టల్లో వార్డెన్ పర్యవేక్షణ లోపం పూర్తిగా కనబడుతుందన్నారు. అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని వార్డెన్ మనోహర్, వంట మనిషి ప్రసాద్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. విద్యార్థులకు అస్వస్థతకు గురవడం బాధాకరమని ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం హాస్టళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులకు వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. పెండింగులో ఉన్న మెస్ బిల్లులు చెల్లించాలన్నారు. మిస్ బిల్లులు, ఇతర వాచ్‌మెన్, ట్యూటర్ వంటి పోస్టులు భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు మహేష్, ఎస్ఎఫ్ఐ ముద్దనూరు మండల నాయకులు గణేష్, నవీన్, గోపాల్, రాజమోహన్, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు సుమంత్, పవన్ పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ, అల్పాహారాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ శ్రీనివాసులు, డిడి సరస్వతికి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

బదిలీ బెంగ!

యథా స్థానాల్లో కొనసాగేందుకు కొందరి యత్నం
సొంత జిల్లాకు రావడానికి పాత వారు మొగ్గు
వైసిపికి వంత పాడిన అధికారుల్లో వైరాగ్యం
అమాత్యుని అపాయింట్‌మెంట్లకు నిరీక్షణ
నేతల చుట్టూ అధికారుల ప్రదక్షిణలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలోని అధికారులకు బదిలీల బెంగ పట్టుకుంది. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కొంతమంది జిల్లా ఉన్నతాధికారులు యథాతథ స్థానాల్లో కొనసాగేందుకు తీవ్ర ప్రయత్నాలు చేసుకుంటున్నారు. వైసిపికి వంతపాడిన కొంతమంది జిల్లా స్థాయి ఉన్నతాధికారులు, రెడ్‌బుక్‌లో పేరు ఉందని భావించిన అధికారుల్లో వైరాగ్యం నెలకొంది. గతంలో జిల్లాలో పనిచేసి, ఇతర జిల్లాలకు బది లీపై వెళ్లిన అధికారులు సొంత జిల్లాలకు వచ్చేందుకు మొగ్గుచూపుతున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన అమాత్యుని అనుగ్రహం కోసం పలువురు మండల, జిల్లాస్థాయి ఉన్నతాధికారులు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి బిజీ షెడ్యూల్ కారణంగా పలువురికి అందుబాటులో లేకపోవడంతో నిరీక్షణ తప్పడం లేదు.



జిల్లాలోని అధికారుల్లో అలజడి నెలకొంది. రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన వెంటనే ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్ వంటి సివిల్ ఉద్యోగుల దగ్గర నుంచి జిల్లా, మండల స్థాయి అధికారులపై దృష్టి సారించింది. ఇందులోభాగంగా ఇటీవల పలువురు ఐఎఎస్‌లను, జిల్లాలో పోలీస్ యంత్రాంగంలో పలువురు సిఐలు, ఎస్ఐలు బదిలీలు చేసిన సంగతి తెలిసిందే. ఇందులోభాగంగానే త్వరలో కలెక్టర్, ఎస్పీ వంటి ఉన్నతాధికారుల బదిలీలు కూడా ఉం టాయనే ప్రచారం నడుస్తోంది. కడప, అన్నమయ్య జిల్లాలోని రాజకీయ నాయకత్వంలో భాగమైన ఎమ్మెల్యేలు, అమా త్యులు తమకు అనుకూలమైన అధికార యం త్రాంగాన్ని నియమిం చుకుని పాలన సాగించడం పరిపాటి. ఇందులో పలువురు ఉన్నతా ధికారులు యథాతథ స్థానాల్లో కొనసాగడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటువంటి అధికారుల కొనసాగింపు విషయంలో ఇటీ వలి కూటమి ఎమ్మెల్యేల సమావేశంలో ఊగిసలాటకు అవకాశం ఇవ్వ రాదని నిర్ణయం తీసుకోవడం గమనార్హం. దీంతో వైసిపికి వంత పాడిన, ఐటీ శాఖా మంత్రి లోకేష్ చేతిలోని రెడ్‌బుక్‌లో పేర్లు ఉన్న అధికారుల్లో నిస్తేజం నెలకొంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో వైసిపి హయాంలో రాజకీయ ఒత్తిళ్ల వల్ల వారికి అనుకూలంగా పని చేయాల్సి రావడంతో నష్టం వాటిల్లిన వారికి ప్రభుత్వ పరంగా పరి హారం అందేలా చేస్తామని హామీలు సైతం ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలోని రాయచోటి ఎమ్మెల్యే రాంప్రసాద్‌రెడ్డి రవాణా, యువజన, క్రీడలశాకా మంత్రిగా బాధ్యతలు చేపట్టడం, అనంతరం శాసన సభ సమావేశాలు ప్రారంభం కావడం, మంత్రి మండలి సమావేశంలో పాల్గొనడంతో ఆలస్యమైంది. ఇటీవల పలువురు మంత్రిని కలిసే ప్రయత్నం చేశారు. ఎవరికి ఎటు వంటి హామీ లభించ లేదని తెలుస్తోంది. దీనికిముందే అన్నమయ్య జిల్లాకు చెందిన ఓ మహిళా ఉన్నతాధికారి పీలేరు ఎమ్మెల్యే దగ్గర బదిలీ అంశంపై ముందు గానే కట్ చీఫ్ వేసినట్లు ప్రచారం నడుస్తోంది. బదిలీల అంశం జిల్లా స్థాయి ఉన్నతాధికారుల్లో గూడుకట్టుకుని ఉన్న ఆందోళనకు అద్దం పడుతోంది. ఏదేమైనా బదిలీల వ్యవహారం ముగిసేవరకు అధికారు లు తమ తమ విభాగాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించే పరిస్థితి కనిపించడం లేదు. ఇందుకు అనుగుణంగానే ఉమ్మడి కడప జిల్లాలో ఇసుక, మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతున్నప్పటికీ చేష్టలు డిగి చోద్యం చూస్తుండడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఇప్పటికైనా జిల్లా రాజకీయ నాయకత్వం ఉన్నతాధికారుల బదిలీల వ్యవహారానికి ముగింపు పలికి, పాలనపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె మున్సిపాలిటీ పరిధిలో మిగులు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని యూటిఎఫ్ నాయకులు కోరారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు సుమారు 40 మంది సబ్జెక్ట్ టీచర్ల కొరత ఉందని పేర్కొన్నారు. మున్సిపాలిటీలోని అన్ని పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల కొరత ఉండడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలకు, పిల్లల సంఖ్య తక్కువగా ఉన్న పిల్లలు లేని పాఠశాలల నుంచి మిగులుగా ఉన్న ఉపాధ్యాయులను అవసరమైన పాఠశాలలకు సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. గత విద్యా సంవత్సరం మధ్యలో సర్దుబాటు చేయడం వల్ల పిల్లలకు సరైన న్యాయం జరగలేదని, కనీసం ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలోనైనా మిగులు ఉపాధ్యాయులను గుర్తించి అవసరమైన పాఠశాలకు సర్దుబాటు చేయాలని కోరారు. ప్రాథమిక విద్యారంగానికి గొడ్డలిపెట్టుగా మారిన జిఒ 117 ను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు సుధాకర్ నాయుడు, జిల్లా కార్యదర్శి పురం వెంకటరమణ, డివిజన్ కన్వీనర్ సుధాకర్, నాయకులు సీనప్ప హరికృష్ణ, గాలిరవీంద్ర, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న బివి.రమణ

సమ్మె హామీలు అమలు చేయాలి

- ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా ఇచ్చిన గత ప్రభుత్వ హామీలను అమలు చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బివి.రమణ, పివి.రమణ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో16 రోజుల సమ్మెకు వైసిపి ప్రభుత్వం దిగొచ్చి సమ్మెకాలం వేతనంతో పాటు డ్రైవర్లకు రూ.24,500లు వేతనం ఇవ్వాలని జిఒలో ఉన్నా అన్నమయ్య జిల్లా లోని మున్సిపాలిటీలో అమలు కాలేదని అన్నారు. ఎన్నికల లో రెండు లేదా మూడు రోజుల పాటు పని చేసిన కార్మికలకు స్టైఫండ్ ఇచ్చారని రాజంపేట, రాయచోటి మున్సిపాలిటీలలో కూడా వెంటనే ఇవ్వాలన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమిస్కిల్డ్ వేతనాలు ఇవ్వాలని, క్లాప్ డ్రైవర్లకు కనీస వేతనం రూ.18,500అమలు చేయాలని కోరారు. నాణ్యమయిన పనిముట్లతో పాటు మాస్కులు, కొబ్బరినూనె, చెప్పులు, మూడు ఖాతాలుగా పిఎఫ్ ఖాతాలు సరిచేసి ఒక ఖాతాగా ఇవ్వడంలో అలసత్వం విడనాడాలని మున్సిపల్ అధికారులను కోరారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి సి.రాంబాబు, పి.విజయకుమార్ పాల్గొన్నారు.

నైతిక విలువలతో కూడిన విద్యను అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన ఉన్నత విద్యను అందించడమే తమ లక్ష్యమని గ్రేస్ గార్డెన్ పాఠశాల ప్రిన్సిపల్ బాబుజాన్ అన్నారు. బుధవారం పట్టణంలోని తరిగొండ రోడ్డులో నూతనంగా ప్రారంభించిన గ్రేస్ గార్డెన్ పాఠశాల వార్షికోత్సవాన్ని నిర్వహించారు. జ్యోతి ప్రజ్వళన చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ వాల్మీకిపురం చరిత్రలో మొట్టమొదటి సారిగా కేరళ యాజమాన్యంతో ప్రారంభించిన మొదటి పాఠశాల తమదే అన్నారు. తమ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించడంతో పాటు విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, యోగా, డాన్స్, కరాటే, అబాకస్‌లల్లో కూడా శిక్షణ ఇప్పిస్తామని పేర్కొన్నారు. అనంతరం వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ అనివేకురైకోస్, అసిస్టెంట్ డైరెక్టర్ రాజేష్, కేరళ బృందం రామ్‌మన్, జాన్‌సన్, మనేష్, ఈపెన్, జోసెఫ్, అబ్రహాము, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టణ పారిశుధ్య మెరుగుకు ప్రత్యేక ప్రణాళిక

- కమిషనర్ వాసుబాబు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

పట్టణ పరిశుభ్రతకు వ్యాపారులు, ప్రజలు సహకరించి స్వచ్ఛ రాయచోటిగా తీర్చిదిద్దే విధంగా కలసి రావా లని కమీషనర్ వాసుబాబు కోరారు. బుధవారం కొత్తపల్లి ప్రాంతం 4,5,6,7, 8 వార్డుల్లో పర్యటించి శానిటేషన్ పనులు పరిశీలించారు.పట్టణంలోని మురికి వాడల్లో పారిశుధ్య మెరుగుకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. సచివాలయ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి, రోడ్లపై మురుగు కాలువలు ఖాళీ ప్రాంతాల్లో చెత్త వేయకుండా అవగాహన కల్పించి మార్పు వచ్చేలా ప్రయ త్నం చేస్తున్నట్లు తెలిపారు. కమిషనర్ వెంట మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ మల్లికార్జున, శానిటరీ విభాగం సిబ్బంది ఉన్నారు.

డయేరియా రోగులతో కిక్కిరిసిన ప్రభుత్వాస్పత్రి

రోగులతో కిటకిటలాడుతున్న ప్రభుత్వాస్పత్రి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

డయేరియాతో స్థానిక ప్రభుత్వాసుపత్రి కిటకిటలాడుతుంది. పట్టణంతో పాటు పునుగుపల్లి, గొళ్లపల్లి ప్రాంతాలకు చెందిన పలువురు ప్రజలు వాంతులు, విరేచనాలతో బాధపడుతూ స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పట్టణానికి చెందిన ఉత్తమ్మ, మహమ్మద్, లక్ష్మీదేవి, నరసింహులు, సాయినాథ్, మురారి, షాహీర్‌బాషా, ఫాతిమాబి తదితరులు వాంతులు, విరేచనాలతో కొన్ని రోజులుగా బాధపడుతున్నారు. ఇప్పటికైనా పట్టణంలోని బాధిత ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని బాధితులు కోరుతున్నారు.

పరిశుభ్రతతో డయేరియా నియంత్రణ సాధ్యం

చేతుల పరిశుభ్రతతో డయేరియా నియంత్రణ సాధ్యమని మండలంలోని చింతపర్తి పిహెచ్‌సి డాక్టర్ జులేఖ బేగం అన్నారు. బుధవారం మండలంలోని చింతపర్తి మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు డయేరియా నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణంలో మార్పులు, వర్షాలు కురవడం, మామిడి పళ్ల సీజన్ కావడం వలన పరిసరాల పరిశుభ్రత లేకపోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడం వంటి కారణాల వలన క్రమంగా డయేరియా కేసులు పెరగవచ్చునన్నారు. ప్రజలు కాచి చల్లార్చిన నీరు త్రాగడం, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించడం, క్లోరినేషన్ చేసిన నీటిని త్రాగడం, మరుగుదొడ్లను ఉపయోగించడం వంటివి చేయాలన్నారు. అలాగే ఓఆర్ఎస్ ద్రావణాన్ని ఎలా తయారు చేసుకోవాలి, ఎక్కడ లభిస్తాయి అనే విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ చేతుల శుభ్రతలోని ఆరు దశలను చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఇందిరా, సుధాకర్, భానుబి, హృదయాశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

వసతి గృహ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రమణ డిమాండ్ చేశారు. పట్టణంలోని బిసి సంక్షేమ శాఖ కార్యాలయంలో ప్రభుత్వ వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వసతి గృహాల్లో నేటికీ వసతులు లేని పరిస్థితి ఉందని, వర్షాలు వస్తే గదులు పూర్తిస్థాయిలో వర్షం నీటితో నిండిపోతుందని అన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ సంక్షేమ హాస్టల్లో ఉన్న సమస్యలపై కలెక్టర్‌కు వివరించడంలో జిల్లా అధికారులు పూర్తిస్థాయిలో విఫలమయ్యారని పేర్కొన్నారు. నేటికీ అనేక సంక్షేమ భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని, మరో పక్క విద్యార్థులకు కావాల్సిన మరుగుదొడ్లు గాని, మంచినీటి సౌకర్యం గాని పూర్తి స్థాయిలో లేవన్నారు. స్థానిక హాస్టల్ వార్డెన్లు ఏమాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆవేదన చెందారు. ఓపక్క పేద విద్యార్థులు సంక్షేమ హాస్టల్లో చదవడానికి పోటీ పెరుగుతున్నప్పటికీ సంక్షేమ హాస్టల్లో వసతులు ఆశించిన స్థాయిలో లేవని అన్నారు. ఇలాంటి వాస్తవ పరిస్థితులు అన్నింటిని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుపోవడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. రాజంపేట ప్రభుత్వ బిసి బాలురు వసతి గృహం, ఎస్‌సి బాలురు వసతి గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయని చెప్పారు. వసతి గృహాలు నేటికీ అద్దె భవనాల్లోనే ఉన్నాయని, వాటికి సొంత భవనాలు నిర్మించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న కాస్మోటిక్, మెస్ చార్జీలు పెంచాలని, వసతి గృహాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులాలు, మహాత్మ జ్యోతిరావు గురుకులాలలో చదువుతున్న విద్యార్థులకు ఏడు నెలలు నుంచి పెండింగ్ లో వున్న మెస్, కాస్మోటిక్ చార్జీలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎఎస్‌డబ్ల్యూఒ, ఎబిసి అధికారులు పర్యవేక్షణ కోసం స్థానికంగా నివాసం ఉండేటట్లు అధికారులు చర్యలు తీసుకోవాలని, అంబేద్కర్ గురుకులాలు, మహాత్మా జ్యోతిరావు గురుకులాలు పర్యవేక్షణ కరువవుతుందని, విద్యార్థులకు మెనూ భోజనాన్ని అందించడం లేదని పేర్కొన్నారు. ప్రస్తుతం వాతావరణ మార్పు వల్ల జలుబు, దగ్గు, జ్వరాల బారిన పడకుండా వసతి గృహాల్లో చదువుతున్న విద్యా ర్థులకు ప్రత్యేక మెడికల్ క్యాంపులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చిన్నరెడ్డి, శంకర్, చరణ్, వినయ్ చంగయ్య పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఇంటర్న్‌షిప్‌కు 'మిట్స్' విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : మదనపల్లె సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో మూడవ సంవత్సరం చదువుతున్న కె.స్వాతి, పి.షాకీర్ హుస్సేన్, పి.తేజశ్రీ, బి.సాయి హర్షిత, కె.సింధు, పి.శ్రీనివాసులు, ఆర్.వినోద్‌కుమార్, ఎస్.గౌతమి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజైన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ కాంచీపురంలో ఇంటర్న్‌షిప్‌లో పాల్గొన్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ఈ ఇంటర్న్‌షిప్ సమయంలో విద్యార్థులు వివిఎస్ఐ డిజైన్ ప్రాజెక్ట్‌లో 45 రోజులు పని చేస్తారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తినాదెళ్ల, విభాగాధిపతి డాక్టర్ రాజశేఖరన్, అధ్యాపకులు అభినందించారు.

ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన మిట్స్ కళాశాల విద్యార్థులు

టిప్పు సుల్తాన్ కాంప్లెక్స్ వద్ద పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

పారిశుధ్యంపై దృష్టి సారించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : స్థానిక పట్టణంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్, అధికారులను ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆదేశించారు. బుధవారం కదిరి రోడ్ లోని టిప్పు సుల్తాన్ కాంప్లెక్స్ దగ్గర మురికి కాలువలను మున్సిపల్ అధికారులతో కలిసి సందర్శించారు. మురికి నీటి కాలువల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో వాటిని తక్షణమే పునరుద్ధించాలని తెలిపారు. రోడ్లపై ఫ్లైఓవర్ల నిర్మాణం పై దృష్టి సారించాలని ఎమ్మెల్యే షాజహాన్ బాష మున్సిపల్ కమిషనర్, అధికారులకు ఆదేశించారు. మేదరవీధి, ఆంజనేయ స్వామి గుడి దగ్గర బ్రిడ్జ్ కాలువను, కదిరి రోడ్ టిప్పు సుల్తాన్ గ్రౌండ్ పరిధిలో కాలువలు, మ్యాంగో ఫ్రూట్ మండి పరిధిలో బైపాస్ రోడ్డు మున్సిపాలిటీ వేస్ట్ యార్డ్ పరిసర ప్రాంతాలలోని కాలువలను అధికారులతో వెళ్లి పర్యవేక్షించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతూ పట్టణంలో ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి పరిష్కరించాలని తెలిపారు. ప్రతిచోట గ్యాంగ్ వర్క్ నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ ప్రమీల, అధికారులు ఉన్నారు.

29న ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-రాయచోటి

ఈ నెల 29న ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు వెంకటేశ్వర మల్టీసూపర్ స్పెషాలిటీ ఎండి డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ప్రజలకు అన్ని రకాల వైద్యం అందించాలని, గర్భిణులు, చిన్న పిల్లలకు 24 గంటలు వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ ఆస్పత్రిని ప్రారంభించినట్లు తెలిఆపరు. తమ ఆసుపత్రి మొదటి వార్షికోత్సవం సందర్భంగా జిల్లా ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని 29న శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒపి, బిపి, షుగర్, ఇతర స్కానింగ్, అన్ని రకాల వైద్యసేవలు ఉచితంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీప బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ ఎంఆర్ఐ స్కానింగ్, టిసిఎస్, పియుసి, డయాలసిస్ మొదలగు వ్యాధులకు వైద్యులు అందుబాటులో ఉన్నారని తెలిపారు. అంబులెన్స్ సౌకర్యం కూడా తమ ఆసుపత్రిలో అందుబాటులో ఉందని అన్నారు. జిల్లాలోని ప్రజలందరూ ఉచిత మెడికల్ క్యాంపును సద్వినియం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డాక్టర్లు శ్వేత, శ్వేత, హరి శ్రీ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : ప్రజలు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని మదనపల్లె డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం మదనపల్లెలో పోలీసులు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. స్థానిక టూటౌన్ పోలీసు స్టేషన్ సమీపంలోని ఆర్‌టిసి బస్టాండ్ నుంచి బెంగళూరు బస్టాండ్ వరకు డ్రగ్స్ వద్దు భవిష్యత్తే ముద్దు అన్న నినాదంతో ప్లకార్డులు చేతపట్టి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ ప్రజలు మత్తు పదార్థాలకు అలవాటు పడటం వల్ల భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. యువత డ్రగ్స్ వినియోగించడం వల్ల సమాజం తిరోగమనంలో పయనిస్తుందని వివరించారు. సామాజిక, మానసిక, శారీరక అనా రోగ్య సమస్యలు తలెత్తడమే కాకుండా దేశ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ మాదక ద్రవ్యాలను పకడ్బందీగా అరికట్టేందుకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. అవగాహన ర్యాలీలో సిఐలు యువ రాజు, వలిబాషా, శేఖర్, సద్గురుడు, ట్రాఫిక్ సిఐ కృష్ణయ్య, ఎస్ఐలు వెంకటసుబ్బయ్య, వెంకటేష్, రవికుమార్, లలితమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

సికిల్ సెల్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

సికిల్ సెల్ వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి-కంభంవారిపల్లి

మండలం లోని నూతనకాలువ మారెళ్లలో సికిల్‌సెల్ అనీమియా వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సికిల్‌సెల్ అనీమియా ఒక దీర్ఘకాలిక వ్యాధి అని, ఇది వారసత్వంగా వచ్చే ఎర్ర రక్త కణాలకి సంబంధించిన వ్యాధి, ఇది తల్లిదండ్రుల నుండి అనువంశికంగా సంక్రమిస్తుందని తెలిపారు. లక్షణాలను బట్టి వ్యాధి నిర్ధారణ చేసుకొని వైద్య సంరక్షణతో సమస్య లేకుండా రోగి జీవన నాణ్యతను మెరుగు పరుచుకోవచ్చునని అన్నారు. లేనిచో రక్తంలోని హిమోగ్లోబిన్ శరీరంలోని వివిధ భాగాలకి ఆక్సిజన్ తీసుకొని వెళ్లే సామర్థ్యంను తగ్గించడమే కాకుండా, శరీరంలో రక్తకణాల పరిమాణం తగ్గి తీవ్ర రక్తహీనతకి దారి తీస్తుందన్నారు. శ్వాస తీసుకోవడం లో ఇబ్బంది, ఒళ్ళు నొప్పులు, కీళ్లనొప్పులు, అలసట,కళ్ళు పసుపు రంగు లోకి మారడం, లివర్, ప్లీహం వంటి అవయవాల వైఫల్యం, గర్భధారణ సమయంలో ఇబ్బందులు వంటి లక్షణాలు వుంటాయని తెలిపారు. ఇలాంటి పరిస్థితి నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ కొరకు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మెడికల్ ఆఫీసర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది ప్రతిభ, నీలావతి, ఆశ కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం కడప శ్రీ సాయి నర్సింగ్ హోంకు చెందిన ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ మాధవి ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సంద`ర్భంగా డాక్టర్ మాధవి మాట్లాడుతూ ఉచితంగా కుట్టు లేకుండా ఐ.ఎల్ మర్షనరీతో ఆపరేషన్లు చేయడం జరుగుతుందని తెలిపారు. ఉచితంగా అత్యాధునిక నేత్ర చికిత్స అందుబాటులో ఉందని కంటి శుక్లముకు కుట్టు లేకుండా అతి చిన్న కోత ద్వారా ఫేకో ఎమల్సీ కేషన్ చేసి ఫోల్డ్ బుల్ లెన్స్ అమర్చబడునని పేర్కొన్నారు. ఈ ఆపరేషన్ వలన పేషంట్ అతి తక్కువ సమయంలో వారి వారి సొంత పనులు చేసుకోవచ్చునని తెలిపారు. ఉచిత వైద్య శిబిరానికి వచ్చే వారు ఆరోగ్యశ్రీ కార్డు, ఆధార్ కార్డ్ ఒరిజినల్ తప్పక తీసుకురావాలని తెలిపారు. ఈ చక్కటి అవకాశాన్ని మండల పరిధిలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

29న గుండె, ఊపిరితిత్తులకు..

ప్రజాశక్తి-పీలేరు : ఈనెల 29న ఉచిత గుండె, ఊపిరితిత్తుల వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు పీలేరు శశి హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ కె. శశిధర్ రెడ్డి, కె. గౌతమ్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సదుం మండలం, ఊట్లగొరిపల్లె గ్రామం, కలకడపల్లెలోని గ్రామ సచివాల యంలో నిర్వహించనున్న వైద్య శిబిరంలో హృద్రోగ వైద్య నిపుణులు డాక్టర్ పి. సుమంత్‌కుమార్‌రెడ్డి, పల్మనాలజీ వైద్యనిపుణులు డి.ధరణీశ్వర్ రెడ్డి, ఎమర్జెన్సీ, జనరల్ ఫిజీషియన్, ఐసియు క్రిటికల్ కేర్ ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ కె.శశిధర్ రెడ్డి పాల్గొంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలో ఉచిత ఇసిజి, కన్సల్టేషన్, న్యూరోపతి స్కాన్, జిఆర్‌బిఎస్, బిపిలను పరీక్షలు చేసి సేవలతో పాటు ఉచిత మందులను కూడా పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్: 9347873739కు కాల్ చేసి తెలుసుకోవాలని కోరారు.

ఉపకార వేతనాలకు ముగ్గురు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-పుల్లంపేట

పుల్లంపేట మండలంలోని ఏపి మోడల్ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎన్ ఎంఎంఎస్‌కు ఎంపికైనట్లు ఏపి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల రాజంపేటలో నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ పరీక్షలో చెందిన ఏపీ మోడల్ స్కూల్ నుంచి విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. తమ పాఠశాలకు చెందిన ఎస్.హేమంత్, కె రితీశ్వరరెడ్డి, ఎం పూజ, నేషనల్ స్కాల ర్‌షిప్‌కు ఎంపికయ్యారు. వారికి సంవత్సరానికి రూ.12వేల చొప్పున నాలుగు సంవత్సరాలలో రూ.48వేలు ఉపకార వేతనం అందుతుందని తెలిపారు. వీరిని మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీహరి ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సంద ర్భంగా పాఠశాల పిల్లల తల్లిదండ్రులు మాట్లాడుతూ మా పిల్లలు స్కాలర్ షిప్‌కు ఎంపిక కావడానికి కృషి చేసిన ప్రిన్సిపల్‌కు ధన్యవాదాలు తెలిపారు.

వైభవంగా కోటకొండ గంగమ్మ తిరుణాల

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లి సమీపంలోని సంత తోపు వద్ద వెలసిన కోటకొండ గంగమ్మ తిరుణాల గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. గంగమ్మ తిరుణా లకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి సతీమణి కవితమ్మ గ్రామ మహిళలతో కలిసి సామూహికంగా ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి ధీలు బోనాలు సమర్పిం చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కలు తీర్చుకున్నారు. అశేష సంఖ్యలో భక్తజనం అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

మత్తు పదార్థాలకు బానిస కావద్దు

ప్రజాశక్తి-కలకడ

విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉజ్వల భవిష్యత్తుకు మార్గాలు వేసుకోవాలని ఎస్ఐ రామకృష్ణారెడ్డి సూచించారు. మండల కేంద్రమైన కలకడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థుల అంతర్జాతీయ డ్రగ్స్ నిరోధక దినోత్సవ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ ఉన్నతమైనదని విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కాకుండా విద్య పైన మక్కువ చూపి క్రమశిక్షణ కలిగి అధ్యా పకుల పట్ల గౌరవ మర్యాదలు కలిగి ఉండాలన్నారు. చెడు వ్యసనాలకు బానిస కాకుండా వాటికి దూరంగా ఉండి తల్లిదండ్రులకు అధ్యాపకులకు పేరు ప్రతిష్ఠలు తెచ్చే విధంగా నడుచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఉన్నతమైన చదు వులు అభ్యసించి ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలను అందుకో వాల న్నారు. విద్యార్థినిలు వారికి ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనేందుకు పోలీ సుల సహాయం పొందాలని తెలిపారు.కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రిన్సిపల్ రమ ణయ్య, ఎస్ఐఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి పుష్పకుమారి,విద్యార్థులు పాల్గొన్నారు. **కలికిరి :** అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని రాయచోటి డిఎస్‌పి శ్రీధర్, కలికిరి పోలీసు స్టేషన్ సిఐ మోహన్ కలికిరి ఎస్ఐ దేవేంద్ర కుమార్ కలికిరిలోని శ్రీనివాస కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిస కావడం వలన జరిగే దుష్ఫలితాలపై అవగాహన కల్పించారు. **రాయచోటి :** విద్యార్థులు మత్తు పదార్థాలకు వినియోగానికి దూరంగా ఉండాలని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో మత్తుపదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచిస్తూ కొకైన్, హెరాయిన్, గుట్కా ,పొగాకు ,ఆల్కహాల్ వంటి మత్తు పదార్థాలు సేవించడం వలన ఆనారోగ్యానికి గురై బరువు తగ్గడం, ఆందోళనకు గురికావడం, ఏకాగ్రత కోల్పోవడం, ఆకలి మందగించడం, వంటి దుష్ప్రభావాలకు గురి అవుతారని వివరించారు.మత్తు పదార్థాలకు బానిసైన వారి కేంద్ర నాడీ మండల వ్యవస్థ అదుపుతప్పి అనారోగ్యానికి గురై ఆర్థికంగా, మానసికంగా శారీరకంగా ఇబ్బందులకు గురై క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు బలవుతారని వివరించారు.

విద్యా దానం గొప్పది

ప్రజాశక్తి-మదనపల్లి: దానాలలోకెల్ల విద్యాదానం చాలా గొప్పది చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ ఎడి డాక్టర్ జిబిఎస్ బాబు అన్నారు. సంస్థ లో చదువుకున్న విద్యార్థుల కోసం మదనపల్లె పట్టణంలోని రెడ్ గార్మెంట్ అధినేత చౌగాలా సింగ్ పురోహిత్ రూ.23,750 విలువ చేసే 82 స్కూల్ బ్యాగులు అందించారు. అంత కాకుండా రూ.20వేలు విలువ చేసే నోటు పుస్తకాలను వితరణ అందజేశారు. చౌగాలా సింగ్ పురోహిత్ ప్రతి ఏడాది సేవా సంస్థలో ఉన్న పిల్లలకు విద్యా సామగ్రితో పాటు పండుగ రోజులలో తినుబండారాలు అవసరమైన వస్తువుల వితరణ చేస్తుంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఏడిలతో పాటు జనరల్ సెక్రెటరీ కవితారాణి, చౌగాలా సింగ్ పురోహిత్ కృతజ్ఞతలు తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం : 'నల్లారి'

ప్రజాశక్తి - కలికిరి

పీలేరు నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. అసెంబ్లీలో శాసనసభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తమ స్వగ్రామం నగిరిపల్లెకు రావడంతో టిడిపి, జనసేన, కూటమి నాయకులు, కార్యకర్తలు, నల్లారి అభిమానులు ఘన స్వాగతం పలికారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలు, కార్యక ర్తలు, పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకురావడంతో సానుకూలంగా స్పందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి కొత్త ప్రభుత్వం కొలువు దీరడంతో వృద్ధులు, వితంతువులకు ఎన్‌టిఆర్ భరోసా పేరుతో ఏప్రిల్, మే, జూన్ మూడు నెలలకు మూడువేలు, జులై నెల నాలుగు వేలు మొత్తం రూ.7వేలతో పాటు నూతన పాస్ బుక్ కూడా లబ్ధిదారుల ఇంటి వద్ద సచివాలయ సిబ్బందితో అందిస్తామని తెలిపారు. ఆగస్టు 1 నుంచి యథావిధిగా నాలుగు వేలు పింఛన్ వస్తుందని అన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలు కూడా త్వరలో శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందిస్తున్న టిడిపి నాయకులు

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి

సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ, వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-చిట్వేలి

మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమంతంగా ఉండాలని ఎంపిడిఒ రంగారావు అన్నారు. బుధవారం స్థానిక వైద్యాధికారి ఎ.అబ్దుల్ వకీల్ అన్సారి, ఇఒఆర్‌డి శివకుమార్, ఏరియా మలేరియా విస్తరణ అధికారి ప్రభుదాసులతో అన్ని గ్రామాల ఎఎన్‌ఎంలు, సెక్రటరీలతో ఎంపిడిఒ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తరచుగా వస్తున్న వర్షాల కారణంగా సీజన్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని దీని నుంచి ముందుగా తీసుకోవలసిన జాగ్రత్తలు పై క్షుణ్ణంగా వివరించారు. నీటి నిల్వలు గ్రామాల్లో ఉన్న ఆ గ్రామ సెక్రటరీ, ఎఎన్‌ఎంలు కలిసి నీరు లేకుండా చూడడం, ఇంటింటికి వెళ్లి పరిసర ప్రాంతాల్లో రకరకాల వస్తువుల్లో నిల్వ ఉండే నీటిని తొలగించడం వాటి వల్ల వచ్చే అనేక అనారోగ్య సమస్యలను వివరించడం, తద్వారా క్రిములు దోమలు ఉత్పత్తి కాకుండా చూడాలన్నారు. ఏదైనా గ్రామంలో ముగ్గురు లేదా నలుగురు ఆపై జ్వరాలతో బాధపడుతున్న వెంటనే ఆ గ్రామాన్ని అబెట్ ద్రావణాన్ని పిచికారి చేయించి దోమల నిర్మూలకు చర్యలు తీసుకోవాల్నఇ తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీలు రమణ ,విజయలక్ష్మి, కేశవరెడ్డి, ఎఎన్‌ఎంలు, రత్నమ్మ, హైమావతి, సెక్రటరీలు పాల్గొన్నారు.

ఘనంగా 'జింపెక్స్' 50వ వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

దేశ చరిత్రలో జింపెక్స్ కంపెనీ యాభై వసంతాలు పూర్తి చేసుకుని అంతర్జాతీయ స్థాయిలో అగ్రస్థానంలో ఉందని ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వర నాయుడు పేర్కొన్నారు. బుధవారం రైల్వేకో డూరు పట్టణంలోని రాజ్ కన్వెన్షన్‌లో జింపెక్స్ 50వ గోల్డెన్ జూబ్లీ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంస్థ అధినేత ఆర్‌ఎస్ గోయంక, టిడిపి పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథ నాయుడు, వినోద్ చౌదరి, మంగంపేట సిపిఒ సుదర్శన్ రెడ్డి, మాజీ సిపిఒ జయసింహ, మాజీ ఎమ్మెల్సీ బత్యాల చంగల్‌రాయలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరనాయుడు మాట్లాడుతూ 14 సంవత్సరాలు బాల్య దశ నుంచి ఎస్‌పి గోయంక కలకత్తా, ముంబై కేంద్రంగా డైమండ్ జువెలరీ వ్యాపార సంస్థను స్థాపించారని అన్నారు. జార్ఖండ్ రాష్ట్రంలో మైకా వ్యాపారం ద్వారా మంగంపేట బైరైటీస్ వ్యాపారంతో అంచెలంచెలుగా సంస్థను విస్తరింపజేశారన్నారు. 1974లో అంతర్జాతీయ స్థాయిలో జింపెక్స్ కంపెనీ ప్రారంభమైందని, కొన్ని వేల మందికి ఉపాధిని కల్పిస్తూ దేశ చరిత్రలోనే అగ్రస్థానాన్ని పదిలం చేసుకున్నదని అన్నారు. ముఖ్యంగా నెలకు 6 కోట్ల రూపాయలు, ఏడాదికి 72 కోట్లు కార్మికులకు వేతనాలు, వాహనాల బడుగులు చెల్లిస్తున్నామని వారు అన్నారు. దివంగత నాయకులు వైఎస్.రాజారెడ్డి, మాజీ ముఖ్య మంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి, వైఎస్ వివేకానందరెడ్డి, సిఎంఆర్, ఐబిసి కంపెనీ కందుల ఓబుల్ రెడ్డి, శనివారపు శంకర్‌రెడ్డి, రాజమోహన్‌రెడ్డి, గునిపాటి మారయ్య, గునిపాటి కేశవులు, రామయ్య, సోదరులు గుత్తిరెడ్డి శ్రీనివాసులు రెడ్డిలు తమ సంస్థకు చేయూతనిచ్చారని అన్నారు. వారి సహకారంతో తమ సంస్థ అగ్రస్థానానికి చేరిందని వారికి ఎప్పటికీ రుణపడి ఉంటామని పేర్కొన్నారు. అనంతరం ఆర్‌ఎస్ గోయంక, ఆయన మేనల్లుడు వినోద్‌చౌదరిలను ప్రముఖులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రైల్వే కోడూరు, మంగంపేట, ఓబులవారిపల్లె తదితర ప్రాంతాలకు చెందిన ముగ్గురాయి వ్యాపారస్తులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్ గోయంక, వినోద్‌చౌదరిలను సన్మానిస్తున్న ప్రముఖులు

ఎంఇఒను విధుల నుంచి తొలగించాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ఎంఇఒ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని ప్రయివేట్ అద్వైత, గౌతమ్, కేరళ స్కూల్ పై చర్యలు తీసుకొని గుర్తింపు రద్దు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాల యం ఎదుట బుదవారం నిరసన తెలిపి అధికారులు ఎవరు కూడా లేకపో వడంతో కంప్యూటర్ ఆపరేటర్ నరసింహరెడ్డి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నరసింహ సర్వేపల్లి మాట్లాడుతూ గౌతమ్ స్కూల్, అద్వైత పాఠశాలకు ఇంతవరకు ఎటువంటి అనుమతులు లేకపోయినా 450 అడ్మిషన్లు చేసుకుందని అన్నారు. కేరళ మోడల్ స్కూల్, శ్రీహరిష రెండు కూడా ఒకే భవనంలో నడుపుతున్నప్పటికీ మండల విద్యాశాఖ అధికారులకు తెలిసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. ప్రయివేట్ పాఠశాలలకు వత్తాసు పలుకుతూ ఎటువంటి ప్రభుత్వ నిబంధ నలు పాటించని పాఠశాలలను తనికీ చేయకుండా వాటిని కాపాడుకుంటూ విద్యా వ్యవస్థకు తూట్లు పొడుస్తున్నారని ఆరోపించారు. విద్యా సంవత్సరం ప్రారంభం అయినప్పటి నుంచి ఇంతవరకు ప్రయివేట్ పాఠశాలలను తనిఖీలు చేసిన పాపాన పోలేదని అన్నారు. పదిరోజుల కింద డిఇఒకు శివ ప్రకాష్ రెడ్డికి జిల్లావ్యాప్తంగా అక్రమ అడ్మిషన్లు, గుర్తింపు లేని పాఠశాలలపై , పాఠశాలలో పుస్తకాల విక్రయాలపై వివరించినట్లు తెలిపారు. అవినీతి అక్రమాలకు పాల్పడుతూ వృత్తి ధర్మం పాటించ కుండా పాఠశాలల యజమాన్యం దగ్గర ముడుపులు స్వీకరిస్తూ విద్యా వ్యవస్థకు తూట్లు పొడుస్తున్న ఎంఇఒపై జిల్లా ఉన్నత విద్యాశాఖ అధికారులు విచారణ జరిపి తక్షణం విధుల నుంచి తొలగిం చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థి యువజన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలను చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మదన మోహన్ రెడ్డి, గణేష్, హఫీజ్ పాల్గొన్నారు.

లోలెవెల్ బ్రిడ్జిల మరమ్మతులకు కృషి : 'ముక్కా'

ప్రజాశక్తి-చిట్వేలి

మండల పరిధిలోని స్థానిక ఎం.రాచపల్లికు కొత్తపల్లి మీదుగా వెళ్లే రహదారిలో ఉన్న బ్రిడ్జి గత కొన్ని సంవత్సరాలుగా వరదల సమయంలో కొట్టుకపోవడంతో దాన్ని తాత్కాలిక మరమత్తులతో కాలయాపన చేస్తూ వచ్చారు. ప్రస్తుతం సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేసేందుకు బుధవారం రైల్వే కోడూరు టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి సంబంధిత అధికారులతో కలిసి లోలెవల్ బ్రిడ్జిని పరిశీలించి దానికి సంబం ధించిన ప్రణా ళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బంది కలి గించే అన్ని లోలెవల్ బ్రిడ్జిలపై నివేదిక పంపి వాటికి శాశ్వత పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర నాయ కులు తాతంశెట్టి నాగేంద్ర, మండల జనసేన నాయకులు మాదాసు నర సింహ, రాజు కుంట సర్పంచ్ గుత్తి నరసింహ గ్రామస్తులు పాల్గొన్నారు.

లోలెవల్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న ముక్కా రూపానందరెడ్డి

టిడిపి నాయకులకు పరామర్శ

ప్రజాశక్తి-పుల్లంపేట : మండల పరిధిలోని దలవాయిపల్లి గ్రామానికి చెందిన రాజారెడ్డి, సిద్ధిక్, సిద్ధారెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, దస్తగిరి తదితర కుటుంబాలను ముక్కా రూపానందరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులకు, కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉంటానని తెలిపారు. ఎటువంటి సమస్యలు వచ్చిన తమ దృష్టికి తీసుకుని వస్తే వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. రైల్వే కోడూరు నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన అజెండాగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్, వేణుగోపాల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జయచంద్రారెడ్డి

ప్రజాశక్తి-ములకలచెరువు

అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించాలని తంబళ్లపల్లి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం ములకలచెరువు, కురబలకోట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వేర్వేరుగా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడిందని అన్నారు. ముఖ్యమంత్రి ఎచంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాల్లో మొట్టమొదటి సరిగా ఐదు పథకాలపై సంతకం చేసారని అన్నారు.రానున్న జులై నెలలో 7 వేలు రూపాయలు వృద్ధులకు, విభిన్న ప్రతిభావంతులకు పింఛన్లు పంపిణీ చేయాలని సచివాలయ అధికారులను కోరారు. గత వైసిపి ప్రభుత్వంలో వెయ్యి రూపాయలు పెంచడానికి నాలుగు సంవత్సరాలు పట్టిందని ఎద్దేవా చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం చేరాలని. ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో ఉన్నటువంటి మా నాయ ఒకులను సంప్రదించి అర్హులైన ప్రతి ఒక్కరికి పంపిణీ చేయాల్సిందిగా సచివా లయ ఉద్యోగులకు సూచించారు. అర్హత ఉండి పింఛన్ రాని వారిని గుర్తించి వారికి పింఛన్ అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒలు పోలప్ప, బ్రహ్మానందరెడ్డి, హరి నారాయణ, తహశీల్దార్ ఈశ్వరమ్మ, ఎంఇఒ ద్వారకనాథ్, వెంకటరమణ, అగ్రికల్చర్ అధికారి రాధ, ఇంజనీర్‌లు మదన మోహన్‌రెడ్డి, ఎపిఒ వెంకటేష్, ఎపిఎం నీరజ,హెడ్‌కానిస్టేబుల్ ఉమామహేశ్వర్‌రావు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలను అందిస్తున్న ఎంఇఒలు

పేద విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-రామాపురం

పేద విద్యార్థులకు2024-25 విద్యా సంవత్సరంలో విద్యా సామగ్రి వస్తువులను పంపిణీ చేయడం సంతోషకరమని ఎంఇఒలు రామకృష్ణుడు, జయచంద్ర పేర్కొన్నారు. మండలంలోని రాచపల్లి పంచాయతీ గంగనేరు లో బుధవారం ప్రధానోపాధ్యాయుడు వెంకటన్న జ్ఞాపకార్థం ఆయన కుమారుడు వాసుదేవ్‌కుమార్ గంగనేరు వెంక టాపురంలోని మూడు ప్రాథమిక పాఠశాలల్లో 150 మంది పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద విద్యార్థుల పట్ల ప్రేమతో తన తండ్రి జ్ఞాపకార్థంగా విద్యాసామగ్రిని పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. చాలామంది విలాసాలకు డబ్బులు ఖర్చు పెడు తుంటారని, అలాంటివారు విద్యార్థుల కోసం కొంత ఖర్చుపెడితే పేద పిల్లలు చదువుల్లో రాణించగలరని అన్నారు. కార్యక్రమంలో నాయనవారిపల్లి ప్రధానోపాధ్యాయుడు విశ్వనాథ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్వాసకోశ వ్యాధులకు ఉచిత వైద్యం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల కేంద్రంలోని ఐటిఐ ఎదురుగా మదనపల్లి వెంకటేశ్వర హార్ట్ మల్టీ స్పెషాలిటీ జులై 1న సోమవారం ఉచిత వైద్య శిబిరం జరుగుతుందని ఆస్పత్రి డాక్టర్ కిషోర్ తెలిపారు. ఈ ఉచిత శిబిరంలో మధుమేహం,అధిక రక్తపోటు, థైరాయిడ్ సమస్యలు, ఆయాసం, శ్వాసకోశ అలర్జీలు వంటి వ్యాధులపై పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని తెలిపారు.

రేషన్ షాపులు పాత డీలర్లకే ఇవ్వాలి

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని 17 గ్రామాలలోని రేషన్‌షాపు డీలర్లకు పాత డీలర్లకు అనుమతులు ఇవ్వాలని టిడిపి మండల అధ్యక్షుడు మందపాటి రవీంద్రబాబు బుధవారం తహశీల్దార్ శ్రీనివాసులకు వినతి పత్రం సమర్పించారు. అరివీడు గ్రామంలో మూడు చౌక దుకాణాలు వారిగా ఆర్డర్స్ ఇవ్వాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. బోరెడ్డి గారి పల్లి గోపనపల్లి, నూలివీడు, గాలివీడు గ్రామాల నుంచి ఆ గ్రామ నాయకులు, డీలర్లు తహశీల్దార్‌తో కలిసి చర్చించారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటి ఉస్మాన్‌బాషా, డిటి తిమ్మారెడ్డి, పాకాల రవికుమార్, మిట్టపల్లి వెంకటరమణారెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

ఆచార్య ఈశ్వర్‌రెడ్డిని రిలీవ్ చేయాలి : టిఎన్ఎస్ఎఫ్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కడప జిల్లాలో ఉన్న యోగివేమన యూనివర్సిటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్‌గా ఈశ్వర్‌రెడ్డిని తొలగించాలని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ రేవూరి వేణుగోపాల్ పేర్కొన్నారు. బుధవారం రాజం పేట లోని తమ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు డిపార్ట్మెంట్ ఆచార్య ఈశ్వం రెడ్డి 09-09-2021న యోగి వేమన యూనివర్సిటీ కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్‌గా నియమితులు అయ్యారని, అదే తేదీన ఆచార్య సుబ్బరాయుడు డీన్, సిడిసిగా నియమి తులయ్యారని తెలిపారు. డీన్, సిడిసిగా సుబ్బరాయుడు రిలీవ్ చేయడం జరిగిందని, రెండు సంవత్సరాలు పూర్తయినా ఈశ్వర్ రెడ్డిని ఎందుకు కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్‌గా తొలగించ లేదని ప్రశ్నించారు. కడప ఎంపీ వై.ఎస్ అవినాష్‌రెడ్డి సమీప బంధువు, వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఇసి.సురేంద్రరెడ్డి ప్రధాన అనుచరుడు, ఎపిఎస్‌సి ఛైర్మన్ హేమ చంద్రారెడ్డి సమీప బంధువు కాబట్టే ఈశ్వర్‌రెడ్డి ఇంకా కంట్రోలర్ అఫ్ ఎగ్జామి నేషన్ పదవి లో కొనసాగుతున్నారని ఆరోపించారు.అయన చేసిన అక్రమాలు, ఆర్థిక లావాదేవీలపై విసి విచారణ చేసి చర్యలు తీసుకోవాలని, లేదంటే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు నబి రసూల్, సాయి ప్రసాద్, నాగరాజ్ పాల్గొన్నారు.

జగన్ శ్రీరంగనీతులు మానుకోవాలి :'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

శ్రీరంగనీతులు వల్లించడం వైసిపి అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి మానుకోవాలని టిడిపి రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్మోహన రాజు పేర్కొన్నారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి 2019లో అధికారం చేపట్టిన మరుక్షణమే ప్రజావేదిక కూల్చివేతతో ప్రారంభించి అక్రమ కట్టడాల వంకతో అనేకమంది టిడిపి నాయకుల భవనాలు కూల్చివేశారని అన్నారు. ఆయన ఎటువంటి అనుమతులు లేకుండా కనీసం భవనాల నిర్మాణాలకు ప్రభుత్వ కార్యాలయాలలో అర్జీలు కూడా సమర్పించకుండా రాష్ట్రంలోని ప్రతి జిల్లాలోనూ విలాసవంతమైన భవనాలు నిర్మించుకొని ఇప్పుడు శ్రీరంగనీతులు వల్లిస్తున్నారని ఆరోపించారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో అధికారులు జగన్ అక్రమ కట్టడాలకు నోటీసులు ఇస్తుంటే తప్పులు కప్పిపుచ్చుకోవడానికి టిడిపి చెందిన మంగళగిరి కేంద్ర కార్యాలయం పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా అసత్య ఆరోపణలు మానుకొని ప్రజా సమస్యలపై పోరాడి ప్రజాభిమానాన్ని చూరగొనేందుకు ప్రయత్నించాలని హితవు పలికారు. కార్యక్రమంలో టిడిపి పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వూరు సుబ్రహ్మణ్యం నాయుడు, పట్టణ అధ్యక్షులు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు, శవనవారి పల్లె సర్పంచ్ కోటయ్య నాయుడు, సీనియర్ నాయకులు జీవీ సుబ్బరాజు, తెలుగు యువత పార్లమెంట్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ సూర్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు హిందుస్థాన్ స్కౌట్స్, గైడ్స్ శిక్షణ

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు శ్రీ భువన విద్యాలయంలో విద్యార్థులకు హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ ప్రారంభం కానుందని, హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డి చెన్నారెడ్డి నుంచి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను అందు కున్నట్లు ప్రిన్సిపల్ గుణలక్ష్మి అన్నారు. అనంతరం విద్యార్థులతో సమావేశంల నిర్వహించి స్కౌట్స్ అండ్ గైడ్ శిక్షణ గురించి వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చెన్నారెడ్డి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో మొట్ట మొదటిసారిగా స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణకు అనుమతిస్తూ పీలేరు శ్రీ భువన విద్యాలయాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ తీసుకున్న విద్యార్థులకు శారీరిక దారుఢ్యంతో పాటు మానసిక దృఢత్వం లభిస్తాయని, కాబట్టి విద్యార్థులు ఈ శిక్షణను తీసుకోవాలని సూచించారు. హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ అండ్ గైడ్స్ శిక్షణ తీసుకున్న విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేయడం జరుగుతుందని, ఈ సర్టిఫికెట్ పొందిన విద్యార్థులకు10వ తరగతి తర్వాత రిజర్వేషన్లలో ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. డిఫెన్స్‌లో ఉద్యోగాలకు అధిక ప్రాధాన్యత ఉంటుందని కూడా అన్నారు. పాఠశాల కరస్పాండెంట్ ఉమా రమాదేవి మాట్లాడుతూ తనకు ఉన్నత పాఠశాల విద్యాభ్యాసంలో జాతీయ స్థాయిలోను, ప్రిన్సిపల్ గుణలక్ష్మికి రాష్ట్రస్థాయిలో స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ శిబిరాల్లో పాల్గొన్న అనుభవం ఉందని అన్నారు. కవిద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకుని స్కౌట్స్ అండ్ గైడ్ శిక్షణ తీసుకుని తమ ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని సూచించారు. స్కౌట్స్ అండ్ గైడ్ శిక్షణ పొందడం ద్వారా జీవిత-నైపుణ్యాలు, జట్టు నిర్మాణం, బహిరంగ సాహసం, విద్య, వినోదాన్ని పొందుతారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ రిజిస్ట్రేషన్ ధృవపత్రాన్ని అందుకుంటున్న ప్రిన్సిపల్ గుణలక్ష్మి